కార్మికులకు అందని వేతనాలు

- ఐదు నెలలుగా అందని వైనం
- ఆర్థిక ఇబ్బందుల్లో జీపీ కార్మికులు
- మండలంలో 117 మంది మల్టీపర్పస్ వర్కర్లు
- జీపీ ఖాతాల్లో సమకూరని నిధులు



చెత్త సేకరణ చేస్తున్న కార్మికులు

దామరగిద్ద: మండలంలోని గ్రామ పంచాయతీ కార్మికులకు వేతన కష్టాలు వెంటాడుతున్నాయి. పంచాయతీల్లో పారిశుద్ధ్యం మొదలు తాగునీరు, పచ్చదనం, విద్యుత్‌దీపాలు, పైప్‌లైన్ల మరమ్మతు, డంపింగ్ యార్డులకు చెత్త తరలింపు వంటి పనులతో నిత్యం సతమతమవుతున్నారు. మల్టీపర్పస్ పనులతో గ్రామాల్లో అన్ని తామై పనిచేస్తున్నారు. మండలంలో 30గ్రామ పంచాయతీల పరిధిలో 117గ్రామ పంచాయతీ కార్మికులు పనిచేస్తున్నారు. ఆయా గ్రామాల్లో గ్రామ పంచాయతీకి సమకూరే నిధుల ఆధారంగా పంచాయతీ కార్మికులకు వేతనాలను అందిస్తున్నారు.

జీపీ ఖాతాల్లో సమకూరని నిధులు

గ్రామ పంచాయతీలకు అందించే జనరల్ ఫండ్, స్టేట్ ఫైనాన్స్, 15వ ఆర్థిక సంఘం వంటి శాఖల ద్వారా నిధులు సమకూరాల్సి ఉంటుంది. ఆయా నిధుల్లో ప్రభుత్వ పంచాయతీ రాజ్ చట్టం నిబంధనల మేరకు కేటాయించిన వాటా నిధుల నుంచి కార్మికుల వేతనాలను చెల్లించాల్సి ఉంటుంది. కాగా గత కొంతకాలంగా స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ నిధులు అందకపోవడం, 15వ ఆర్థిక సంఘం నిధులు వినియోగించుకునే అవకాశం లేకపోవడంతో కేవలం టీఎస్‌బీపాస్ ద్వారా రిజిస్ట్రేషన్లు, వివిధరకాల ట్యాక్స్‌ల ద్వారా పంచాయతీ ఖాతాల్లో జమచేసే జనరల్ ఫండ్ మాత్రమే వేతన నిధులకు వినియోగిస్తున్నారు. దీంతో ఖాతాల్లో నిధులు లేక వేతనాలు అందకపంచాయతీ కార్మికులు ఆర్థిక ఇబ్బందులతో కుటుంబాలను నెట్టుకొస్తున్న దుస్థితి నెలకొంది. ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించి వేతనాలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

సౌకర్యం కల్పించాలి..



మూడు నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదు. మాది పెద్ద గ్రామ పంచాయతీ కావడంతో రోజుఏదో ఒక చోట పూడిక తీత, చెత్త తొలగింపు వంటి పనిచేస్తూనే ఉంటాం. నెల నెల జీతం లేక ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు వేతనం అందించి సౌకర్యం కల్పించాలి.

- వెంకటప్ప, జీపీ కార్మికుడు, దామరగిద్ద

అప్పులు చేసుకుంటున్నాం..



నెల నెల జీతం వస్తుందని ఆశతో పనిచేస్తున్నా.. మూడు నాలుగు నెలకొసారి ఒక్కో నెలజీతం ఇస్తున్నారు. జీతం అందక ఇళ్లు గడవక అప్పులు చేసుకోవాల్సి వస్తుంది. సెలవు దినాల్లో కూలీపనికి వెళ్లి పూటక డుపుకుంటున్నాం.

- ఎల్లప్ప, గ్రామ పంచాయతీ కార్మికుడు

ప్రతిపాదనలు పంపించాం.

మండలంలోని ఆయా గ్రామాలకు సమకూరుతున్న నిధులు ఆధారంగా కార్మికుల వేతనాలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొన్ని గ్రామాల్లో వేతనాలకు సంబంధించి ఎస్‌టీఓలో పెండింగ్‌లో ఉన్నాయి. కార్మికుల వేతనాలను నేరుగా వారి ఖాతాల్లో జమచేసేలా ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం.

- సాయి లక్ష్మి, ఎంపీడీఓ, దామరగిద

క్లుప్తంగా

రైతుల ఖాతాలోకి బోనస్ డబ్బులు



మాగనూర్: ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారమే రైతు ఖాతాలోకి ధాన్యం డబ్బులతోపాటు బోనస్ డబ్బులు కూడా జమ అవుతున్నాయని మండల ఏఓ సుదర్శన్‌గౌడ్ అన్నారు. మంగళవారం రైతు వేదికలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు నిర్వహించిన రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు.. రైతులకు ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం ప్రతిగింజ కొనుగోలు చేయడంతో పాటు వారికి ధాన్యం సంబంధిత డబ్బులు చెల్లిస్తుందన్నారు. పంటసాగులో ఏవైనా సందేహాలు ఉంటే సంబంధిత వ్యవసాయ అధికారిని సంప్రదించాలని తెలిపారు. ఏఓ సుదర్శన్‌గౌడ్, ఏఈఓ పవన్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



మక్తల్: పట్టణంలో శ్రీ భవానీమాత ఆలయంలోని కార్తీక మాసం సందర్భంగా మహిళలు ఆలయంలో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, నింకార్‌మాధురి, అనసూయ, గాయత్రి, సరితా, ప్రియాంక, సంధ్య పాల్గొన్నారు.

చెన్వార్ వాసికి డాక్టరేట్

మద్దూరు: మండలంలోని చెన్వార్ గ్రామానికి చెందిన మిణిగేరి రాములు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు మంగళవారం తెలిపారు. ప్రొఫెసర్ ఐ. పాండురంగారెడ్డి పర్యవేక్షణలో హైడ్రోజియోలాజికల్, జియో ఫిజికల్ స్టడీస్ అన్ కాకరవాణి రివర్ బేసిన్, వికారాబాద్ జిల్లా ఈ అంశాలపై పరిశోధనకుగాను డాక్టరేట్ ప్రదానం చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

ఘనంగా తాయమ్మవ్వ బోనాలు



మాగనూర్: మండల పరిధిలోని అమ్మపల్లిలో మంగళవారం తాయమ్మవ్వ బోనాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. మహిళలు అలంకరించిన బోనాలను మారెమ్మవ్వ ఆలయం చుట్టూ ఊరేగించారు. భక్తులు కొళ్లు, గొర్రెలను అమ్మవారికి బలిచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గుట్కా పాకెట్ల పట్టివేత

నారాయణపేట: జిల్లా కేంద్రంలోని ఎండీ యూసఫ్‌కి చెందిన కిరాణా షాప్‌లో మంగళవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి రూ.13,700 విలువగల గుట్కా పాకెట్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఎండీ యూసుఫ్‌పై కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా ప్రభుత్వ నిషేధిత గుట్కా పాకెట్లను నిల్వ ఉంచిన, అమ్మిన అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం చర్యలుంటాయని ఎస్ఐ హెచ్చరించారు.

వ్యర్థాలు పడేశారని జరిమాన.. గుండెపోటుతో మహిళ మృతి

మక్తల్: బతుకుదెరువు కోసం కూరగాయల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ మహిళ గుండెపోటుతో మృతిచెందింది. వివరాలిలా.. పట్టణంలో బాలమ్మ అనే మహిళ కూరగాయలు అమ్ముకొని జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో మంగళవారం రోడ్డుపై వ్యర్థాలు పడేసిందని ఆమెకు మున్సిపల్ సిబ్బంది రూ.200 జరిమానా వేసి వసూలు చేస్తుండగా గుండెపోటుకు గురైంది. వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందింది. అయితే కమిషనర్ ఫైన్ వేయడం వల్లే గుండెపోటుతో మృతిచెందిందని స్థానికులు ఆరోపించారు. ఈ విషయమై కమిషనర్ భోగేశ్వర్‌ను వివరణ కోరగా తాను ఎవరిని బెదిరించలేదని, రోడ్డుపై చెత్తాచెదారం వేయడంతో రూ.200 ఫైన్ వేశామని చెప్పారు. బాలమ్మ మృతితో తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు.



కొనసాగుతున్న ఇంటింటి సర్వే



మాద్వార్‌లో సర్వే చేస్తున్న సిబ్బంది



సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రహమతుద్దీన్

మక్తల్: మండల కేంద్రంతోపాటు ఆయా గ్రామాల్లో సమగ్ర సర్వే కొనసాగుతుంది. ఎంపీడీఓ రమేష్ ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ప్రత్యేకాధికారులు పరిశీలించి సూచనలు, సలహాలు ఇవ్వడంతోపాటు సర్వే విధానంపై అవగాహన కల్పిస్తున్నారు.

మాగనూర్: ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటా సర్వే గ్రామాల్లో 80శాతం పూర్తయినట్లు ఎంపీడీఓ రహమతుద్దీన్ తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఇంటింటా సర్వే కార్యక్రమం విజయవంతంగా సాగుతుందని, మండల ప్రజల సంపూర్ణ సహకారంతో సర్వే చివరి దశకు చేరుకుందని ఆయన అన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో కొనసాగుతున్న సర్వేను ఆయన పరిశీలించి ఎదురవుతున్న సమస్యలను సర్వే ఎన్యుమరేటర్లను అడిగి తెలుసుకున్నారు.

విద్యార్థుల సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నర్వ: జాతీయ స్థాయిలో నిర్వహించే న్యాస్ పరీక్షలకు అనుగుణంగా విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ రామకృష్ణ అన్నారు. మంగళవారం మండలంలోని ప్రాథమిక పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ మేరకు.. తరగతి గదిలో విద్యార్థులచే చదవడం, రాయడంపై ఆయన స్వయంగా విద్యార్థులను పరీక్షించారు. న్యాస్ పరీక్ష కోసం మూడో తరగతి విద్యార్థులకు ప్రత్యేకంగా బోధించాలన్నారు. 3,4,5 తరగతుల విద్యార్థులకు ఇంగ్లిష్, తెలుగు, గణితం సబ్జెక్టులలో సామర్థ్యాలను ఆయన పరీక్షించారు. హెచ్ఎంలు ఉపాధ్యాయులతో ప్రతి నిత్యం ఎఫ్ఆర్ఎస్ అటెండెన్స్ తీయాలన్నారు. మండలం నుంచి వచ్చే రిపోర్టులను ఎప్పటికప్పుడు పెండింగ్‌లో లేకుండా పంపించాలన్నారు. ఈమేరకు.. హెచ్ఎం వేణుగోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు రాజు, నాగలక్ష్మి, అనిత, రాజేష్, హరిశంకర్ పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ గురుసేవలో తరించాలి



భక్తి ప్రవచనాలు చేస్తున్న స్వామిజీ

నారాయణపేట టౌన్: సద్గురు అవధూత నర్సింహాస్వామి మహిమలు అపారమని ప్రతి ఒక్కరూ గురుసేవలో తరించాలని బాల అవధూత ప్రకాశానంద సరస్వతి స్వామి అన్నారు. మంగళవారం పట్టణంలోని సుభాష్‌రోడ్‌లో సద్గురు అవధూత నర్సింహాస్వామి వారి ఆరాధన మహోత్సవాలను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చరణాలతో రుద్రాభిషేకం, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రాసద వితరణ చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగురావు నామజీ జిల్లా అధ్యక్షుడు పగడాకుల శ్రీనివాస్, మఠం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

ఝాన్సీలక్ష్మీబాయిని ఆదర్శంగా తీసుకోవాలి



మాట్లాడుతున్న వెంకట రాములు

నారాయణపేట ఎడ్యుకేషన్: పట్టణంలోని ఎస్‌వీఎస్ ఇంటర్మీడియట్ కళాశాలలో మంగళవారం ఏబీవీపీ ఆధ్వర్యంలో శక్తి దివాస్ ఝాన్సీ లక్ష్మీబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు.. కళాశాల ప్రిన్సిపాల్ శేషమ్మ, మరాటి వెంకట రాములు మాట్లాడుతూ.. స్వేచ్ఛభారత దేశం కోసం కలలు కన్న వీరవనిత ఝాన్సీలక్ష్మీబాయి అని కొనియాడారు. కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా కన్వీనర్ నరేష్, సతీష్, రేణుక, ఓంకార్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభం

నర్వ: నేడు మండల పరిషత్ కార్యాలయ సమీపంలో ఏర్పాటుచేసిన మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభోత్సవం నిర్వహిస్తున్నట్లు మండల అధ్యక్షులు చెన్నయ్యసాగర్ తెలిపారు. ఈ ప్రారంభోత్సవానికి కలెక్టర్ సిక్తాపట్నాయక్, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరీ హాజరవుతున్నారన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మంజూరైన మహిళా శక్తి క్యాంటీన్ ప్రారంభానికి మండలంలోని కాంగ్రెస్ నాయకులు, మహిళా సంఘాల నాయకులు తదితరులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి

నారాయణపేట: జిల్లా కేంద్రానికి సమీపంలోని ఎక్లాస్‌పూర్ తిమ్మప్ప ఆలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి నేతృత్వంలో అన్నివిధాలుగా అభివృద్ధి పరుస్తామని డీసీసీ మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి భరోసానిచ్చారు. మంగళవారం ఆలయాన్ని సందర్శించి ఆలయ కమిటీ సభ్యులతో పలు సమస్యలు, అభివృద్ధి పనులపై చర్చించారు. ఆలయాభివృద్ధిపై సీఎం రేవంత్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుచేయించి ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేస్తామన్నారు. ఆయనతో పాటు మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, ఊశప్ప, తారక్, ఆనంద్, అశోక్ పాల్గొన్నారు.

రేపు ప్రజా పాలన విజయోత్సవాలు

దామరగిద్ద: మండలంలోని వివిధ గ్రామాల్లో ఈ నెల 21న ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయిలక్ష్మి తెలిపారు. ఉదయం 9గంటలకు గడిమున్కన్‌పల్లిలో 11గంటలకు దామరగిద్ద గ్రామాల్లో సాంస్కృతిక, కళాజాత బృందాలతో ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నాటక సమాజ సమైక్య జిల్లా అధ్యక్షుడికి సన్మానం



ఊట్కూరు: మక్తల్ పట్టణంలో మంగళవారం రాష్ట్ర నాటక సమాజాల సమైక్య జిల్లా అధ్యక్షుడు ఎక్స్ చక్రధర్‌కు స్థానికులు సన్మానించారు. ఆయనకు శాలువా పూలమాలలతో సత్కరించారు. జయానంద్, రాజుల ఆసిరెడ్డి, మారుతిగౌడ్, వెంకటరాములు, మురళీధర్ రెడ్డి, హనుమంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరాగాంధీకి ఘన నివాళి



మరికల్‌లో విగ్రహానికి పూలమాల వేస్తున్న నాయకులు



మక్తల్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

మక్తల్: పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె దేశానికి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో చంద్రకాంత్‌గౌడ్, లక్ష్మారెడ్డి, కట్ట సురేష్‌గుప్తా, రవికుమార్, నారాయణ, వాకిటి శ్యాం, గోవర్ధన్ పాల్గొన్నారు.

కృష్ణా: మండలంలోని ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా గ్రామంలోని పేదలకు పండ్లు పంపిణీ చేశారు. నాయకులు రాజప్పగౌడ, శంకర్‌రెడ్డి, అంజప్ప, సద్దాంహుసేన్ తదితరులు ఉన్నారు.

మరికల్: మండల కాంగ్రెస్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పండ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వీరన్న, హరీష్, ఆనంద్‌కుమార్, గోపాల్, రాములు, రామకృష్ణారెడ్డి, రామకృష్ణ, శ్రీను, మల్లేష్, అంజిరెడ్డి, ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, మొగులప్ప తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీకి మరమ్మతు



నారాయణపేట టౌన్: గతనెల రోజులుగా పట్టణంలోని ప్రధాన రహదారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీ మరమ్మతు చేయకపోవడంతో 'తవ్వారు.. వదిలేశారు' శీర్షికతో ఈనెల 17న సాక్షి దినపత్రికలో రావడంతో కథనానికి మున్సిపల్ అధికార యంత్రాంగం స్పందించింది. మున్సిపల్ సిబ్బందిచే మంగళవారం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజ్ మరమ్మతును చేపట్టారు. దీంతో పాదచారులు, వాహనాదారులు సంతోసం వ్యక్తం చేశారు.

ఘనంగా మహిళా దినోత్సవం

కోస్గిరూరల్: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించినట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వార్ల విజయ్‌కుమార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీ కేంద్రంలోని గ్రంథాలయ భవనంలో పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ఇందిరాగాంధీ జీవిత చరిత్రపై ఉపన్యాస పోటీలు, ముగ్గుల పోటీలు చేపట్టామన్నారు. ఇందులో గెలుపొందిన వారికి చివరి రోజు బహుమతులు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ శ్రీధర్, ఎంఈఓ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీలో కార్మిక హక్కులను కాపాడాలి



మాట్లాడుతున్న నాయకులు

నారాయణపేట: ఆర్టీసీలో కార్మిక హక్కులను కాపాడాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో ఎదుట నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, కార్యదర్శి బాల్‌రాం మాట్లాడుతూ.. ప్రజా పాలన అంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.. ఆర్టీసీలో తక్షణమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలన్నారు. కేసీఆర్ హయాంలో కార్మికుల హక్కులను కాలరాశారని.. కార్మికుల న్యాయమైన ఉద్యమంపై ఉక్కుపాదం మోపారని విమర్శించారు. అయితే కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కార్మికుల హక్కులు కాపాడబడతాయని భావిస్తే.. గత ప్రభుత్వ విధానాలనే అమలు చేస్తున్నారన్నారు. నిరంకుశ పాలనతో నియంతలా వ్యవహరించే పాలకులు ఎవరైనా ఓటమిని మూటకట్టుకోక తప్పదని హెచ్చరించారు. ఇప్పటికైనా ఆర్టీసీ కార్మికులపై వేధింపులు ఆపడంతో పాటు క్రెడిట్ కోఆపరేటివ్ సొసైటీకి ఎన్నికలు నిర్వహించాలని, బస్సుల సంఖ్య పెంచాలని, కార్మిక సంఘాల భాగస్వామ్యంతో బోర్డు ఆఫ్ ట్రస్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బొమ్మన్‌పాడ్ బలరాం, నాగప్ప పాల్గొన్నారు.

ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఊట్కూరు: ఇంటింటికీ మరుగుదొడ్లు నిర్మించుకోవాలని ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్ అన్నారు. మండలంలోని మంగళవారం ప్రపంచ మరుగుదొడ్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బహిరంగ మలమూత్ర విసర్జనను ప్రజలు అరికట్టాలని కోరారు. మరుగుదొడ్లు లేని వారు తమ ఇంటి పరిసరాలలో నిర్మించుకుంటే ప్రభుత్వం ద్వారా రూ. 12వేలు ఆర్థిక సాయం అందిస్తుందన్నారు. ఇప్పటికి మండలంలోని పలు గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా బహిరంగ మలవిసర్జన చేపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామాల్లో యువకులు, విద్యావేత్తలు, ప్రజాప్రతినిధులు కలిసి మరుగుదొడ్లు లేని ఇళ్లను గుర్తించి మరుగుదొడ్లు కట్టే విధంగా అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఏపీఓ సత్యప్రకాష్, ఎంపీఓ లక్ష్మీనర్సింహారాజు, గ్రామ కార్యదర్శి శ్రీనివాస్‌రావు, టీఏ గోపాల్, శివ, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనాథ శరణాలయానికి భారీ విరాళం

మాగనూర్: మండల పరిధిలోని నేరడగం శ్రీ పశ్చిమాద్రి సంస్థానం ఆవరణలో నూతనంగా నిర్మిస్తున్న అనాథ శరణాలయానికి కర్ణాటక రాష్ట్ర ధర్మస్థల్ ఎంపీ, రాజ్యసభ సభ్యులు వీరేంద్ర హెగ్డే భారీ విరాళంగా రూ. 10లక్షలు అందజేసినట్లు పంచమ సిద్ధలింగ మహాస్వాములు తెలిపారు. ఈ మేరకు.. వారు కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఈ విషయంపై వివరించారు. అనంతరం స్వామిజీ మాట్లాడుతూ.. మార్చినెలలో జరిగే జాతర వరకు మఠంలో అనాథ శరణాలయం, గోశాల భవనాలు ప్రారంభోత్సవం ఉంటుందని తెలిపారు. అశోక్‌గౌడ్, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు



అవగాహన కల్పిస్తున్న సీఐ శివకుమార్

ఆత్మకూర్: కళాశాలలు, పాఠశాలల్లో సీనియర్లు జూనియర్లపై ర్యాగింగ్‌కు పాల్పడితే తెలంగాణ ర్యాగింగ్ ప్రొహిబిషన్ యాక్టు 1197 ప్రకారం చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని సీఐ శివకుమార్, ఎస్ఐ నరేందర్ అన్నారు. మంగళవారం స్థానిక వికాస్ కళాశాలలో ర్యాగింగ్ నిర్మూలన అంశంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తోటి విద్యార్థులను ర్యాగింగ్ పేరిట అవమానాలకు గురిచేసిన, దాడులకు పాల్పడిన, ఆత్మహత్యలకు ప్రేరేపించిన, నిర్బంధాలకు గురిచేసిన చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, ఇంటర్‌నెట్ వినియోగం పెరిగిన తర్వాత సైబర్ నేరాలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. అపరచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్‌కు వ్యక్తిగత ఓటీపీలు, బ్యాంకు వివరాలు, చెప్పొద్దని సూచించారు.

ఎల్ఈడీ బల్బుల ఏర్పాటు



నర్వ: మండలంలోని రాంపూర్ గేట్ వద్ద కొన్ని రోజులుగా విద్యుత్ బల్బులు లేక చీకటిగా ఉందని ఆయా గ్రామాల ప్రజలు తెలిపినట్లు బీజేపీ నాయకులు బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి తెలిపారు. నిత్యం ఈ గేట్ నుంచి మరికల్, ఆత్మకూర్, అమరచింత, దేవరకద్ర గ్రామాలకు వెళ్లే ప్రయాణికులకు రాత్రి వేళల్లో బల్బులు లేక చీకటిగా ఉందని అభ్యర్థించారన్నారు. వీరి అభ్యర్థన మేరకు రాంపూర్ గేట్ వద్ద నాలుగు వైపుల నాలుగు ఎల్ఈడీ బల్బులను మంగళవారం ఏర్పాటు చేయించారు. అనంతరం దాత బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డిని ఆయా గ్రామాల ప్రజలు అభినందించారు. కార్యక్రమంలో నాయకులు రాజు, శ్రీను, రాజేష్, నాగేష్‌రెడ్డి, యాదవరెడ్డి, వడ్డె రవి, వెంకటేష్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సన్మానం పొందిన గురువులతో పూర్వ విద్యార్థులు

కోస్గి: మండల కేంద్రంలోని స్థానిక పంచాక్షరీ గార్డెన్స్‌లో మంగళవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1990–91లో పదోతరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమకు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈమేరకు.. కలిసి చదువుకున్న మరోమారు కలుసుకొని తమ తమ సాధకబాధకాలను చర్చించుకుని మురిసిపోయారు. అనంతరం సన్మానం పొందిన గురువులు సైతం ఇది జీవితంలో మరచిపోని ఘట్టంగా తమ పూర్వ విద్యార్థులను అభినందించారు. కుదుముల వెంకట్రాములు, పొన్నం వెంకట్రాములు, నర్సింహులు, చంద్రశేఖర్ ఉన్నారు.